కథానిక

# సుఖపడ్డ జీవుడు

టేకుమళ్ల కామేశ్వరరావు

పొత్తికడుపులో బయలుదేరిన నొప్పికి తిప్పమ్మ ధర్మాసుపత్రిలో చేరింది. చికిత్స చేశారు. ఏరోజు వస్తుందని ఆమె హడలిపోతూ ఎదురుచూసిందో ఆ రోజు వచ్చింది. లేడీ డాక్టరు "తిప్పమ్మా! ఆసుపత్రినుంచి రేపు వెళ్ళాలి!" అంది.

తిప్పమ్మ గుండెలలో రాయి పడింది.

"అమ్మా! అమ్మా! మరి నాలుగురోజులు" అని తిప్పమ్మ అంటూండగానే లేడీ డాక్టరు "నాలుగురోజులే!" అంది.

లేడీ డాక్టరు కాస్త మెత్తనయిన మనిషి. ఇంతకీ ఇటువంటివాళ్ళని ఆమె ఎంతమందిని చూసిందో! అందుచేత "ఎల్లుండి తప్పదు!" అని చెప్పి, తన పనిమీద ముందుకు సాగిపోయింది.

తిప్పమ్మ మరొకరోజు గడిచినా గడిచినట్లే అనుకొంది.

ఆమె రోగివేషంలో ఉంది. ఒక తెల్లటి మూతక అంగా, తెల్లటి ముతక జాకెట్టు; ఆసుపత్రివారిచ్చిన దుస్తులవి. ఆమె కట్టుకొని వచ్చిన చిరుగుల గుడ్డ పరుపుకింద పదిలంగా దాచుకొంది. "ఇంటి కెళితే అక్కడేముంది ఎముకలు! తిండా తిప్పలా!" ఆమెకు ఆసుపత్రిలో ఆపరేషన్ అయేక కాస్త కాఫీ రొట్టె, పళ్ళరసం, బార్లీగంజి ఇచ్చేవారు. కుట్లు విప్పేక పొద్దున్న రెండు ఇడ్డెన్లు, అరటిపండు, కాఫీ, తర్వాత అన్నం పులుసు, చేప, మజ్జిగ ఇచ్చేవారు. రాత్రికూడా భోజనం పెట్టేవారు.

"కొంప కెళితే దిక్కేమిటి!" ఆమెకు కావలసినవాళ్లు భూమిమీద ఎవ్వరూ లేరు; ఆకాశంలో భగవంతుడొక్కడే!

తిప్పమ్మ తన ముందుగతిని ఎన్నిసార్లో ఆలోచించుకొంది. ఆసుపత్రిలో చేరిన రోజు దగ్గరనుంచీ ఆలోచిస్తూనే ఉంది. ఆసుపత్రిలో చేరకముందు, వ్యాధి బాధిస్తూన్నా, కొంచెం తిరుగుతూ ఏవేవో పనులు చేసుకొంటూ రెక్కల కష్టంమీద బతికేది. ఇప్పుడు రెక్కలలో శక్తి కనబడనే కనబడదు. నిల్చుంటే కుప్ప కూలిపోయేటట్లూ వుంది. "ఓపికంతా ఏ యేట్లో కలిసిపోయిందో!" అనుకొంది.

ఆసుపత్రిలో చేరినమర్నాడు లేడీ డాక్టరు పరీక్ష చేసి ఒక రూపాయ చేతిలో పెట్టింది. ఆ రూపాయే తిప్పమ్మ బట్టకొంగున భద్రంగా మూటకట్టుగొంది. ఇంటికి వెళితే అదెంత కాలం వస్తుంది?" అనుకొంది.

తిప్పమ్మ మాటపడే మనిషి కాదు. ఆసుపత్రినుంచి మర్యాదగానే వెళ్ళిపోదలుచుకొంది. మనిషి వరుగులాగయిపోయింది. నర్సమ్మ అల్లిన జానెడు పండువెంట్రుకల జడ, వంగిన నడుం.

ఆసుపత్రి గేటు దాటింది. మైలున్నర దూరమున్న గూడేనికి పోవాలి. కాళ్ళీడ్చుకొంటూ బయలుదేరింది. కర్ర ఒకటి ఆధారం చేసుకొంది. దారిలో నాలుగుసార్లు తూలి పడడానికి సిద్ధమయింది. కాస్తసేపు కూర్చుంది. అక్కడే నేలమీద కుళ్లుమళ్లు అరటిపళ్లు పెట్టుకొని ఒక అమ్మి అమ్ముతూంది. తిప్పమ్మ రూపాయి మార్చింది. కాణీ ఇచ్చి ఒక అరటిపండు కొనుక్కొంది. తిని, ఇన్ని నీళ్లు త్రాగింది. కాస్తసేపు ఆయాసం తీర్చుకొంది. అంత నిస్సత్తువ ఆమెజన్మలో ఎరగదు. గూడేనికి ఈ కాస్తదూరమే కదా అనుకొంది. కాని అదే యోజనాలలాగు కనబడుతూంది. అడుతూ పడుతూ ప్రయాణం సాగించింది.

గూడెంలో అమ్మలక్కలు, పిల్లలు ఆమె చుట్టూ చేరేరు. "అవ్వా! బాగున్నావా?" అని కుశలప్రశ్న వేశారు.

"అంతా మీదయే!" అంది తిప్పమ్మ.

"మా దయేముందవ్వా? ఆసుపత్రి వాళ్ళ

దయగాని!" అన్నారు అమ్మలక్కలు.

తిప్పమ్మ గుడిసెలోకి వెళ్ళింది. దేవుడి దయ వల్ల తాటాకులు పీకి పారవెయ్యలేదు. లోపలి కుండ ముంత- మంచివి- ఆకతాయి పిల్లలు కాజేశారు. ఆసుపత్రివాళ్ళిచ్చిన రూపాయి మాట జ్ఞాపకం రాగా "కుండకి ఫర్వాలేదు, కుండలోకి పొయ్యేకిందికే ఇబ్బందిగాని!" అనుకొంది

ఆపూటేనా ఇన్ని గంజినీళ్లు పోసే దిక్కు కనబడలేదు. ఆరాత్రికి పాతగోనెపట్టాలు వేసుకొని కాళ్లు ముణగదీసుకొని పడుకొంది. ఎప్పటికీ తెల్లవారదు!

"అంట్లు తోముకొని బతుకుదామంటే గూళ్ళలో శక్తిలేదు పిడకలమ్ముకొని జీవిద్దామంటే పొలాలమీద తిరగలేను. కూలి నాలి చేసుకొందామంటే వెళ్ళలేను, ఏమి గతో! భగవంతు ఇంత కాలం బతకనియ్యడమెందుకు? నేనేం చెయ్యాను. ఎక్కడికి పోను? ఏమిదారి?"

ఊళ్ళో అత్యాధికారి ఇంటిలో పెళ్ళి అని ఎవరో ఆమె చెవిని వేశారు. అక్కడికి ఏలాగో నడిచి పోదామనుకొంది.

పందిటిలోను, ఇంటిలోను కోలాహలంగా ఉంది. వీధిలో ముష్టివాళ్లు యెంగిలాకుల కోసం దెబ్బలాడుకొంటున్నారు. తిప్పమ్మ మొర ఆలకించినవారెవ్వరూ లేరు!

అన్నదాన సమాజంలో అన్నం పెడతారని యెవరో అంటూండగా విని వెళ్ళింది. కాని నియమ ప్రకారం కొన్ని సమయాలలో మాత్రమే అన్నదానం చేస్తారు అది ఆమెకు ఇప్పుడు పనికివచ్చేదేమీ లేదు.

ముసలివాళ్ళకి తిండిపెట్టే ఇల్లొకటుందని విని శ్రమపడి అక్కడికి వెళ్లింది. కాని అది డబ్బులేక మూలపడిందని తెలుసుకొంది. అందువల్ల కడుపు నింపేదీ లేదు, కాలం నింపేదీ లేదు.

తిప్పమ్మ పనిపాట్లు చేసుకోలేకపోగా తన దగ్గిరున్న డబ్బులన్నీ నెమ్మది నెమ్మదిగా ఖర్చయిపోయేయి. అయిన తర్వాత బతకడమెట్లాగని సమస్య ముష్టి ఎత్తుకు జీవించడం ఆమెకు ఇష్టంలేదు, "చేసుకొంటే పనిపాట్లు చేసుకోవాలి, లేకపోతే పస్తుండాలి!" అని నిశ్చయించుకొంది. ఒంటిలో ఏమాత్రమూ ఆరోగ్యం లేదు. తిండి తిప్పలు లేక నీరసించిపోయింది. ఇరుగుపొరుగు వాళ్ళని కాణీ అర్ధణా అప్పు అడగడం మొదలుపెట్టింది. కాణీ సంపాదన లేని ముసలమ్మకి అప్పెవరిస్తారు. అందు చేత నిరాహారంగా గుడిసెలోనే పడుకోవలసివచ్చింది. తన స్థితి తలుచుకోగా ఆమెకు కంగారు పుట్టింది. దారీ తెన్నూ కనబడకపోగా బెంగ పట్టుకొంది. బతుకు నిరుత్సాహమనిపించింది.

జ్వరం తగలడం చేత తిప్పమ్మ గుడిసె దాటి ఎక్కడికీ వెళ్లలేకపోయింది. మనస్సు పరిపరి విధాలగా పోయేది. వెనకటి జీవితమంతా జ్ఞప్తికి వచ్చింది. చిన్నతనంలో పోయిన బిడ్డనూ మొగుణ్ణి తలచుకుని కన్నీరు కార్చింది. "చావు కాలానికి లావు దుఃఖం!" రాత్రి శీతలంకంటె మనస్సులో శీతలం అధికమయింది.

తిప్పమ్మ గుడిసె ఇవతలకి రాకపోగా ఇరుగుపొరుగువాళ్ళు వచ్చి భోగట్టా చేశారు. ఆమె దీన స్థితి చూసి జాలిపడ్డారు. ఆమెకిది అంత్య దశ అని భావించేరు.

ఆమెకు స్మారకం లేదు, పొరుగింటి ఇల్లాలు ఒకర్తె దయ దలచి గంజి అవ్వా గంజి!" అంటూ అరిచింది. తిప్పమ్మకి మెలకువ రాలేదనుకొని అపక్కనే ఉన్న బోలెలో పోసి వెళ్ళిపోయింది. మరికాస్తసేపటికి ఒక దొంగకుక్క జొరబడి ఆ కాస్తా కలికివేసి పోయింది

* * *

పొద్దు పొడిచింది. గూడెంలో పనిపాట్లుకి పోయేవారు పోయేరు. తిప్పమ్మస్థితి చూసి పోదామని ఒకరిద్దరు అమ్మలక్కలు గుడిసెలోకి వచ్చేరు. ఆమె ప్రాణాలు విడిచిందని గ్రహించేరు. సానుభూతిగా కన్నీటి చుక్కలను విడిచేరు. పదిమందీ పోగయేరు. ఆత్మ పరమాత్మను కలియగా, మట్టిమట్టిలో కలిసింది.